క్లుప్తంగా

వ్యవసాయ యంత్రాల పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న పరికరాలు

గూడెంకొత్తవీధి: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా సీహెచ్‌సీ గ్రూపులకు వ్యవసాయానికి ఉపకరించే యంత్రాలను రాయితీపై పంపిణీ చేస్తున్నామని చింతపల్లి వ్యవసాయశాఖ ఏడీ జాహ్నవి అన్నారు. గూడెంకొత్తవీధి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రభుత్వం పంపిణీ చేసిన యంత్రాలను అధికారులు ఆయా గ్రూపులకు గురువారం అందజేశారు. ఏవో మధుసూదనరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

40 మందికి వైద్య పరీక్షలు



పెదవలసలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి కోమలి

గూడెంకొత్తవీధి: ముందు జాగ్రత్తలతో చాలా వరకూ వ్యాధులను నివారించవచ్చునని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి కోమలి అన్నారు. ప్యామిలీఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా పెదవలసలో 40 మందిని పరీక్షించారు.పది మంది దీర్ఘకాలిక రోగులకు అవసరమైన మందులను ఇచ్చారు.అంటువ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది అనీషా, దేవమణి, పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మలేరియా నివారణకు దోమ తెరల వినియోగంతోపాటు దోమల నివారణ మందును గ్రామాల్లో పిచికారీ చేపడుతున్నట్టు పెదవల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు అన్నారు.పీహెచ్‌సీ పరిధిలో సురవరం గ్రామం నుంచి ప్రారంభించి 20 గ్రామాల్లో మందును రెండో విడత పిచికారీ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ అచ్యుతరావు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం



.నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో రామచంద్రరావు

డుంబ్రిగుడ: ప్రభుత్వం అమలు చేసిన నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈవో రామచంద్రరావు అన్నారు. మండలంలోని సోబురు, పిత్తగుడ ప్రాథమిక పాఠశాలల్లో సందర్శించి అక్కడ జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయా పనులను వేగవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలని కోరారు.

నేడు మర్రి కామయ్య వర్ధంతి



మర్రి కామయ్య విగ్రహం

హుకుంపేట: స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు మర్రి కామయ్య ఆశయ సాధన సమితి సభ్యులు పాంగి సత్యరావు, కొర్ర కృష్ణమూర్తి, శంకరరావు, నాగేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కామయ్యపేట గ్రామం కామయ్య సమాధి వద్ద నిర్వహించే కార్యక్రమానికి స్థానికులు, అధికారులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గడప గడపకూ సంక్షేమం



గూడెం కొత్తవీధిలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పెదబయలులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని గిరిజన మహిళకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అచ్చియ్యపేటలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గూడెంకొత్తవీధి: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఇది తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనత అని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గూడెం కొత్తవీధి సచివాలయం -1 పరిధిలోని రామలయం వీధి, కొత్తపాకల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో 108 గడపలను ఆమె సందర్శించారు. రానున్న ఎన్నికల్లోనూ తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు.గడపగడపకూ తిరిగి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని, గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ బోయినకుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీటీసీలు నాగమణి, రాజేశ్వరి కాసులమ్మ, సర్పంచ్ సుభద్ర ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భగవంతరావు, వ్యవసాయ అధికారి మధుసూధనరావు, ఈవోపీఆర్డీ పాపారావు, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటరావు, వాలంటీర్లు పవన్, గిరి, నాయకులు అంజి, అరుణ్, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పెదబయలు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలు మండల సీతగుంట గ్రామ సచివాలయం పరిధిలోని పెదబయలు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, ప్రధాని మోదీ కూడ ప్రశంసించారన్నారు. అరకు నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సైతం రహదారుల నిర్మాణం, మౌలిక సదుపాయల కల్పన జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సారిస్తామన్నారు. చిట్రాయిపుట్టు గ్రామానికి చెందిన జర్రై కర్రమ్మ పెద్ద కర్మ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, నాయకులు గంగాభవాని, సూర్యనారాయణ, సూరయ్య, కొండబాబు, సింహాచలం, సావిత్రి, రామ్మూర్తి, కృష్ణ, రామదాసు, కన్వీనర్లు కనకరాజు, అజయ్‌కుమార్, వార్డు సభ్యులు జీవన్‌కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అకాంక్ష మేరకే పాలన

అడ్డతీగల: ప్రజల ఆకాంక్షల మేరకే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన కొనసాగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల మండలం బొడ్లంక పంచాయతీలోని అచ్చియ్యపేట, లోతావారివీధి గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అలాగే ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గిరిజనులకు వేలాది ఎకరాల భూములకు అటవీ హక్కు పత్రాలను ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టి పేద వర్గాల ప్రజలు అందరూ చదువుకొని ఉన్నతమైన జీవితాలు దరిచేరాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్పొరేట్ వైద్య సేవలు సైతం సామాన్యుని దరిచేర్చారన్నారు. పలువురు వారి సమస్యలను ఎమ్మెల్యే ధనలక్ష్మికి వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాంబాబు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శివలింగాల వితరణ

అడ్డతీగల: పవనగిరి ట్రస్ట్ తరఫున మన్యంలోని 10 గంగాలమ్మ ఆలయాలకు డప్పులు, శివలింగాలు వితరణ చేస్తున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. వీటిని ఈనెల 7న వై.రామవరం మండలం దుమ్ముగడ్డ గ్రామంలో నిర్వహించనున్న కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా అందిస్తామన్నారు. ఒంగోలు ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త శివప్రసాద్ సౌజన్యంతో ఆయా సామాగ్రిని అందజేస్తున్నట్టు చెప్పారు.

7న రక్తదాన శిబిరం

కొయ్యూరు: అల్లూరి వర్ధంతి సందర్భంగా ఈనెల 7న రాజేంద్రపాలెంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు బల్ల ప్రసాద్, లకే సురేష్, ఎన్ సోమన్నదొర, సురబోయిన చిన్ని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎందరో ప్రాణాలను కాపాడుతోన్న రక్తదానాన్ని ఎక్కువ మంది చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ సహకరిస్తుందని ఎంపీపీ బడుగు రమేష్ చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ద్వారా ప్రారంభించనున్నట్టు తెలిపారు.

11న చలో కలెక్టరేట్

చింతపల్లి: పాడేరులో ఈ నెల 11న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం అఖిల భారత కౌన్సిల్ సభ్యులు అప్పల నరసయ్య అన్నారు.గురువారం స్థానిక గిరిజన భవన్‌లో నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల ఆదివాసీ, గిరిజన సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. గిరిజన సమస్యలపై ఈ నెల 11 న పాడేరులో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి

చింతూరు: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, అర్హులందరికీ ఆ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి అన్నారు. మండలంలోని మోతుగూడెం, కొత్తపల్లి, గూడూరు సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు గురించి వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని, దీనిని నెరవేర్చేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే అనేక పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయని, ఇంకా ఎవరైనా అర్హులుంటే వారిని గుర్తించి పథకాలు అందేలా చూడాలన్నారు. ఎంపీడీవో వెంకటరత్నం, ఎంపీపీ సవలం అమల, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: వర్షాలు కురుస్తున్న వేళ ప్రజలకు సురక్షితమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఎంపీడీవో బాపన్నదొర పంచాయతీ సెక్రటరీలు, తదితర సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతు వసతి గృహాలు, అంగన్‌వాడీలను తనిఖీ చేయాలని కోరారు. చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నది లేనిది పరిశీలించి నివేదఇవ్వాలని కోరారు. మిషన్ వాత్సల్య పథకంపై దరఖాస్తులు చేసుకొనేవారికి తగిన విధంగా సహాయ పడాలని ఆదేశించారు. ఏఎన్‌ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు హాజరయ్యారు.

ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరత్నం

చింతూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) సర్వేపై గురువారం వివిధ శాఖల సిబ్బందితో ఎంపీడీవో వెంకటరత్నం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0 నుంచి 5, 6 నుంచి 9 ఏళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు ఆధార్ సీడింగ్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నారన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులంతా యుద్ధ ప్రాతిపదికన ప్రతి గ్రామంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనివల్ల ఎస్‌డీజీ సర్వేకు ఆటంకాలు లేకుండా ఉంటాయని, దీనిపై గ్రామాల్లో అందరికీ అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర



నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టంలో శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గురువారం గుర్రప్పందాలునిర్వహించారు. వివిధ జిల్లాల నుండి 15 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. రావన్నపాలెం చోడమాంబ గుర్రం, దేవరాపల్లికి చెందిన మధురి సాయి గుర్రం, చోడవరానికి చెందిన మోదమాంబ గుర్రం గెలుపొందాయి. గెలుపొందిన గుర్రాల విజేతలకు పూర్వ సీఐ స్వామినాయుడు, ప్రస్తుత సీఐ గణేష్, గ్రామ పెద్దలు శెట్టి మోహన్, గుడబండి నాగేశ్వరరావు బహుమతులు అందజేసారు. అమ్మవారి జాతరను పురష్కరించుకుని అదే మైదానంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు



సీతపల్లి ఆలయంలో హుండీ లెక్కింపులో ఉద్యోగులు

రంపచోడవరం: సీతపల్లి బాపనమ్మ ఆలయం హుండీ లెక్కింపు గురువారం ఆలయ ఈఓ సత్యరమేష్, పాడేరు దేవాదాయశాఖ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కె.చంద్రతేజల పర్యవేక్షణలో జరిగింది. ఏడు నెలల 19 రోజులకు గాను హుండీ ఆదాయం రూ. 10.85లక్షలు వచ్చినట్టు తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బొబ్బా శేఖర్, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, కుంచే లక్ష్మి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐ రుద్రశేఖర్‌ని పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రజప్రతినిధులు

అరకులోయ రూరల్: అరకులోయ సీఐగా బాధ్యతలు చేపట్టిన అరకులోయ సీఐ రుద్రశేఖర్‌ను ఏఎంసీ చైర్మన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, వివిధ పార్టీ నాయకులు గురువారం కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. సీఐ రుద్రశేఖర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు చేరువగా మరిన్ని సేవలు అందిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, వివిధ పార్టీల నాయకులు సుంద్ర, అమ్మన్న, కుమార్, వర్తక సంఘం అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ భవన నిర్మాణానికి భూమిపూజ



పూజ చేస్తున్న భక్తులు, ప్రజా ప్రతినిధులు

జి.మాడుగుల:అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం సింగర్భ పంచాయితీ మధుమామిడి గ్రామంలో చిద్గగానానంద మహర్షి ఆశ్రమంలో గురువారం నూతన ఆశ్రమ భవనం నిర్మాణానికి భక్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. పలు మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: మండల కేంద్రమైన అడ్డతీగల నుంచి రాయపల్లి వరకూ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రంపచోడవరం రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ప్రధానంగా మిట్లపాలెం, డి.భీమవరం, మల్లవరం మామిళ్ళ, నిమ్మలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు పాడేరులో..

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలో 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్ల నిర్వాహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9గంటల మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్‌ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కొత్తవీధిలో సుమారు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రతిష్ట చేయనున్న విగ్రహాలకు క్షీర, జల, పుష్పాదివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఇతర సభ్యులు, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



స్థానిక పీహెచ్‌సీ వద్ద పైపులైన్ లీకుతో వృథాగా పోతున్న తాగునీరు

అనంతగిరి: మండల కేంద్రంలోని స్థానిక పీహెచ్‌సీ వద్ద పైపు లీకై తాగునీరు వృథాగా పోతున్నా స్పందన లేకపోవడంతో అధికారులు తీరుపై పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మారుమూల గ్రామాల్లో తాగునీటికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే ఇక్కడ తాగునీరు పైపులైన్ నుంచి వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, వృథాగా పోతున్న తాగునీటికి అడ్డకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సెల్‌టవర్ నిర్మాణానికి శంకుస్థాపన



సెల్‌టవర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మీనా, నాయకులు

సాక్షి,పాడేరు: వనుగుపల్లి పంచాయతీలోని మారుమూల బంగారుమెట్ట, సమీప 30 గ్రామాలకు సెల్ సెంకేతాలు అందుబాటులో రానున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బంగారుమెట్ట కొత్తూరులో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ నిర్మాణానికి గురువారం సర్పంచ్ మువ్వల మీనా, ఎంపీటీసీ రేగం భానుమతిలు శంకుస్థాపన చేసారు.పంచాయతీ కార్యదర్శులు చిన్ని, నారాయణమ్మ, మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు, నాయకులు వి.ఎస్.నాయుడు, సచివాలయాల కన్వీనర్ కామేశ్వరరావు, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు, వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవుల్లో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గ్రామానికి వెళ్లి చదవడం మాకిష్టం (వుయ్ లవ్ రీడింగ్) అనే కార్యక్రమాన్ని గురువారం కించుమండ పంచాయతీ కొసోంగుడ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం విలీయం కేరి ప్రారంభించారు. విద్యార్థులకు శాఖ గ్రంథాలయ పుస్తకాలను చదివించారు. విద్యార్థులకు కథనాలు చదివించారు. దీంతో విద్యార్థులకు చదువుపై మరింత నైపుణ్యత కలిగి ఉంటుందన్నారు. ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపట్టిందన్నారు. చదువుతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు.

రక్షణ రంగంలో అపార ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు పీపీటీ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారి రంధ్వ

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రక్షణ రంగంలో లభించే ఉద్యోగ అవకాశాలు, ఆయా ఉద్యోగ అవకాశాలకు నేర్చుకోవాల్సిన ఆర్మీ అధికారి మేజర్ రంధ్వ గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అగ్నిపథ్ ర్యాలీకి హాజరయ్యే విద్యార్థులకు, విద్యార్హతను బట్టి లభించే బోనస్ మార్కులను వివరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీలో ప్రవేశాలు, ఆర్మీ నర్సింగ్ సర్వీస్ వంటి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి మణికంత, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తల్లి జాతర

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెంలో బంగారమ్మ తల్లి జాతరను గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఏటా ఈ జాతరను మత్యకారులు అత్యంత వైభవంగా జరుపుతారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పసుపుకుంకుమలు, చీర, సారెలు సమర్పించారు. రాత్రికి భారీ బాణసంచా వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. జాతరను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

రెండు పాజిటివ్ కేసులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో గురువారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా రెండు పాజిటివ్‌లు నిర్ధారణ అయినట్టు డాక్టర్ సుజి తెలిపారు. రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీలలో ఎటువంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు.

7న ఎం. కోడూరు మోదకొండమ్మ పండగ



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు →

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ దేవత, మోదకొండమ్మ అమ్మవారి పండగ ఈ నెల 7న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సర్పంచ్ సంజీవిరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ప్రజాప్రతినిధులు హాజరవుతారని సర్పంచ్ పేర్కొన్నారు.